నది.. వాగయ్యింది!

- 30 ఏళ్ల క్రితం జీవనదిగా భవనాశి
- నేడు ఆక్రమణలు, పూడికతో కుంచించుకుపోయిన వైనం
- చర్యలు తీసుకోకపోతే కనుమరుగయ్యే ప్రమాదం
- అభివృద్ధి చేస్తే నాలుగు మండలాల రైతులకు ఉపయోగం



కనుమరుగవుతున్న భవనాశి నది

ఆత్మకూరు: భవనాశి నది తరతరాలుగా ఎంతో పవిత్రతను చాటుకుని వేసవికాలం, చలికాలం, వర్షాకాలం అనే తేడా లేకుండా అన్ని కాలాల్లో ప్రవహించేది. ప్రస్తుతం ఈ నది ఆక్రమణలకు గురై, పూడికతో నిండి తన సరిహద్దులను, రూపురేఖలు కోల్పోయి కేవలం ఒక వాగులా కనిపిస్తూ నది స్వభావాన్ని కోల్పోతోంది. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే నది కనుమరుగై పిల్లకాలువగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళవ్యక్తం చేస్తున్నారు.

నదికి ప్రత్యేకత..

నల్లమలలో ప్రవహించే నదులలో భవనాశి నదికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడే పుట్టి సుమారు 70 కిలోమీటర్ల దూరంలోని సప్త నదుల కూడలి వద్ద కృష్ణమ్మ ఒడిలో కలుస్తుంది. భవనాసి అంటే 'భవ' అంటే పాపం, 'నాశి' అంటే పోగొట్టడం అని అర్థం. సర్వపాపాలను పోగొట్టే నదిగా ఈ ప్రాంతంలో భవనాశి నదికి పేరుంది. సాధారణంగా అన్ని నదులు పడమట నుంచి తూర్పుకు ప్రవహిస్తాయి. కానీ ఈ నది నల్లమలలో తూర్పున పుట్టి, పడమట సంగమేశ్వర క్షేత్రం వద్ద కృష్ణమ్మ ఒడిలో కలుస్తుంది. ఈ నది ఒడ్డున ఇస్కాల గ్రామం వద్ద శివాలయం ఉంది. నది చివరన అత్యంత పవిత్రమైన సంగమేశ్వరక్షేత్రం కొలువుతీరి ఉంది. ఎంతో విశిష్టతతో పాటూ పాండవులు సైతం ఈ ప్రాంతంలో సంచరించినప్పుడు భవనాశిలో పవిత్ర స్నానం ఆచరించి ఇస్కాల గ్రామంలోని శివాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు స్కందపురాణం తెలుపుతుంది.

కొన్ని చోట్ల పూర్తిగా స్వభావం కోల్పోయిన నది

నల్లమల నుంచి సిద్దాపురం మీదుగా ఆత్మకూరు పట్టణానికి చేరుకున్న ఈ నది ఆత్మకూరులో తన స్వభావాన్ని కోల్పోయింది. కొందరు ఆక్రమించుకోవడంతో నది వాగులా కనిపిస్తోంది. పాములపాడు మండలంలో ఈ నది యథావిధిగా ఉన్నప్పటికీ చెలిమెళ్ల నుంచి కొత్తపల్లి మండలం నాగం పల్లి సమీపంలో ఎస్ఆర్ఎంసీ కాల్వ ఆనుకుని ఉండడంతో పూర్తి స్థాయిలో నది స్వభావం కోల్పోయింది. కొంత దురాక్రమణ, ఎస్ఆర్ఎంసీ బ్యాక్‌వాటర్ వలన పూడిక నిండడం, కాల్వ గట్లు ఆనుకుని ఉండడం వలన నదిపూడి పోవడం వలన నది తన స్వరూపాన్ని కోల్పోయింది. తిరిగి ఇదే మండలంలోని కొక్కెరంచ సరిహద్దులు దాటిన అనంతరం జూపాడుబంగ్లా మండలంలోని చాబోలు వద్ద ఈ నది కనిపిస్తూ సంగమేశ్వర క్షేత్రం వద్ద పాయలా కృష్ణానదిలో కలుస్తూ భక్తులకు కనువిందు చేస్తుంది.

సిద్దాపురం నీటిని మళ్లిస్తే పంటలు సస్యశ్యామలం..

అన్ని కాలాల్లో నీరు పుష్కలంగా ప్రవహించే ఈ నది, ప్రస్తుతం వర్షాకాలం నుంచి చలికాలం లోపు మాత్రమే ప్రవహిస్తుంది. వేసవికాలం అసలు ఈ నదిలో చుక్కనీరు కూడా లభించే పరిస్థితి లేదు. నదిలో పూడిక తీసి, సిద్దాపురం నుంచి నీటిని మళ్లిస్తే ఆత్మకూరు మండలంలోని శ్రీపతిరావుపేట, ఆత్మకూరు, కొత్తపల్లి మండలం దుద్యాల, పాములపాడు మండలం ఇస్కాల, చెలిమెళ్ల తో పాటూ కొత్తపల్లి మండలంలోని పలు నదీ పరివాహక గ్రామాల్లో పొలాలు సస్యశ్యామలమయ్యే అవకాశం ఉందని అన్నదాతలు పేర్కొంటున్నారు. అంతే కాకుండా ఒకప్పుడు తమలపాకు తోటలకు ఎలా సమృద్ధిగా పండేవో, ప్రస్తుతం కూడా అలాగే పండుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భవనాశి వాగును విస్తరించాలి



భవనాసి నదిని మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు విస్తరించాలి. ఒకప్పుడు భవనాసి నది ఎంతో విశాలంగా లోతుగా ఉండేది. ప్రస్తుతం నది ఆక్రమణకు గురికావడంతో విస్తీర్ణం తగ్గడమే కాకుండా పూడికతో నిండి ఉంది. ఒకప్పటి జీవనది నేడు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. అధికారులు నది విస్తరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– మహబూబ్‌బాషా, ఆత్మకూరు

రైతులకు ఎంతో ఉపయోగం



భవనాసి నదిని అభివృద్ధి చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. భవనాసి ఒడ్డున ఉన్న ఆకు తోటలతో పాటు, ఇరువైపులా రైతులు సాగు చేసే మొక్కజొన్న, పత్తి, మినుము, తదితర పంటలకు సాగునీరు అందుతుంది. రైతులకు ఎంతగానో ఉపయోగపడే నదిని విస్తరించాల్సిన అవసరం ఉంది.

– శివనాయక్, ఎస్ఎస్ తండా

జీవాలకు టీకాలు



టీకాలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: నట్టల నివారణ కోసం జీవాలకు టీకాలు వేసే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో గొర్రెలకు చీడపారుడు వ్యాధి నివారణకు టీకాల వేసే కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ అధికారులతో కలసి మున్సిపల్ చైర్మన్ ప్రారంభించారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వరప్రసాద్ మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశు వైద్యులను సంప్రందించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ అధికారులు మౌలాబి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, ఉపేంద్రారెడ్డి, బాబు, ధనుంజయరెడ్డి, రమేష్, గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షులు భాస్కర్, సభ్యులు రమేష్ పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

కొత్తపల్లి: మండలంలోని ముసలిమడుగు గ్రామ ఎస్సీ కాలనీలో నీటి సమస్యకు నియోజకవర్గ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పరిష్కారం చూపించారు. కాలనీలో నీటి సమస్య తీర్చాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిసి విన్నవించడంతో ఆయన స్పందించి శుక్రవారం బోరు వాహనాన్ని పంపించి కాలనీలో బోరు వేయించారు. 5 ఇంచులమేర నీరు పడటంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన వేల్పనూరు గ్రామంలో పర్యటించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్లను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ మంచానికి పరిమితమైన పలువురికి తన వంతుగా ఆర్థికసాయం అందించారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో పుట్టి ప్రమాదంలో మరణించిన గ్రామానికి చెందిన శీలం శ్రీనివాసులు, శీలం మద్దమ్మ కుటుంబానికి ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులు, వెలుగోడు రైస్ మిల్లర్స్, ఎంపీపీ స్నేహితుల సహకారంతో సేకరించిన రూ.1,26,000 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బన్నూరు అంకిరెడ్డి, ఎంపీటీసీలు బన్నూరు తోయ జనాభారెడ్డి, పల్లె వెంకట్రామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమా, ఎంపీడీఓ షేక్ అమానుల్లా పాల్గొన్నారు.

పొత్తు కొత్త విషయమేమీ కాదు

వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తు విషయం కొత్తేమీ కాదని అందులో ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. చంద్రబాబుకు పవన్‌కళ్యాణ్ దత్తపుత్రుడన్న విషయం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఎన్ని పార్టీలు ఏకమైనా వైఎస్సార్‌సీపీ గెలుపును ఆపలేరన్నారు. 2014, 2019 ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేశామని, 2024 ఎన్నికల్లోనూ ఒంటరిగానే వెళ్తామన్నారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా ఈ నాలుగేళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, ఇవే తమకు విజయాన్ని అందిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు రూరల్: సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమైందని నందికొట్కూర్ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వడ్డెమాను గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పలకరించారు. పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. వలంటీర్ల ద్వారా సంక్షేమ ఫలాలను ప్రజల వద్దకే అందజేస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారన్నారు. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడాను గమనించి మంచి చేసిన వారినే వచ్చే ఎన్నికల్లో ఆదరించాలని ప్రజలకు సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి ఆహార నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు ప్రతి రోజూ మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎంపీడీఓ శోభారాణి, సీఐ విజయ భాస్కర్, ఏఓ షేక్షావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు హరిసర్వత్తోమరెడ్డి, వనజ, సగినేల వుశేనయ్య, మాధవరం రత్నం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు



వెంచర్ చుట్టూ ఉన్న కంచెన్‌ను తొలగిస్తున్న కుడా అధికారులు

నందికొట్కూరు: అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కుడా(కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) వైస్ చైర్మన్ ప్రతాప సూర్యనారాయణరెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ విజయభాస్కర్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణ సమీపంలో కొణిదేల రోడ్డుకు జగనన్న కాలనీ వద్ద వేసిన అక్రమ వెంచర్లను కుడా అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు తీసుకోకుండా వెంచర్లు వేయడంతో మూడు సార్లు నోటీసులు ఇచ్చామన్నారు. స్పందివచకపోవడంతోనే చట్ట పరమైన చర్యలు తీసుకున్నామన్నారు. కుడా అనుమతులు లేని వెంటర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందుల్లో పడొద్దని ప్రజలకు సూచించారు. వీరి వెంట మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాలమద్దయ్య, వార్డు ప్లానింగ్ సెక్రెటరీలు రియాజ్, నరేష్, జ్ఞానేశ్వరి, కిరణ్మయి ఉన్నారు.

సచివాలయ కన్వీనర్లకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్

జూపాడుబంగ్లా: సచివాలయ కన్వీనర్లకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం వైఎస్సార్‌సీపీ కల్పిస్తున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్‌లో జేసీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తద్వారా కన్వీనర్ల వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఒక్కో వలంటీరు పరిధిలో నలుగురు గృహసారథుల వివరాలు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఒక్కో గృహసారధికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు. ఇన్సూరెన్స్ సౌకర్యం కలిగిన కన్వీనర్లు, గృహసారథులు సహజ, ప్రమాద మరణం సంభవిస్తే వారి నామినికి ఇన్సూరెన్స్ మొత్తం వర్తిస్తుందన్నారు.

ఘనంగా ప్రపంచ ఓజోన్ దినోత్సవం



పటేల్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి ప్రధాన రహదారి వెంట పటేల్ సెంటర్ వరకు విద్యార్థులు ఫ్లెక్సీలు చేత బట్టుకుని, నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ సునీత ఆమె మాట్లాడుతూ ఓజోన్ వల్ల కలిగే లాభ నష్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. మొక్కలకు, పంటలకు, జంతువులకు, మానవాళికి కలిగే నష్టాలు, అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు షాలిసాహెబ్, ఫర్వీన్, గోవిందరాజులు, సుమలత, రామకృష్ణయ్య, పాల్గొన్నారు.

నియోజకవర్గ క్రీడలకు విద్యార్థుల ఎంపిక



పాములపాడు: ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, సిబ్బంది



బొల్లవరంలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని బొల్ల వరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులు మండల స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం లక్ష్మీనరసమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె విద్యార్థినులను అభినందించారు.

పాములపాడు: స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ విద్యార్థులు నియోజవకవర్గ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వెంకటసుబ్బమ్మ తెలిపారు. పీడీ రాజశేఖర్‌తో కలిసి విద్యార్థులను ఆమె శుక్రవారం అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మిడుతూరు: కులం పేరుతో దూషించిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ మారుతీ శంకర్ తెలిపిన వివరాలు.. ఉప్పలదడియ గ్రామానికి చెందిన ఎనబోతుల సుబ్బయ్యను అదే గ్రామానికి చెందిన అక్బర్‌బాషా, అతని భార్య అమ్‌తుల్‌బీ, మామ షరీఫ్, బామ్మర్ది ఫరూక్ పొలం రస్తా విషయంలో గొడవపడి కులం పేరుతో దూషించారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీఎంను విమర్శిస్తే సహించేదిలేదు

- జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి



మాట్లాడుతున్న జడ్పీటీసీ పోచాజగదీశ్వరరెడ్డి

జూపాడుబంగ్లా: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాలిగోటికి కూడా సరిపోని వారు ఆయనను విమర్శిస్తే సహించేది లేదని జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ నాయకులు కోసిక తిరుమలేశ్వరరెడ్డి, టి.కృష్ణారెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జున రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడి జైలుపాలైన చంద్రబాబునాయుడి కోసం ఆ పార్టీ నాయకులు నిరసనలు వ్యక్తం చేయటం హాస్యాస్పదమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో చంద్రబాబునాయుడు చేసిన దోపిడీని సీబీఐ అధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి, సాక్ష్యాధారాలతో అరెస్ట్ చేయడంతోనే కోర్టు రిమాండ్ విధించిందన్నారు. ఈ విషయంలో కొంత మంది టీడీపీ నాయకులు స్థాయిని మరిచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డిని విమర్శించటం చూస్తే వారి సంస్కారంలేని, నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమన్నారు.

ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యం

నందికొట్కూరు: ఈ నెల 30 నుంచి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తునట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు వివిధ రకాల పరీక్షలు, మందులు, అవసరమైన వారికి మెరుగైన వైద్యం, ఆస్పత్రులకు తరలించడం తదితర సేవలు అందించాలన్నారు.

ఓంకారేశ్వరుడికి రుద్రాభిషేకం

మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారం ఆలయంలో కొలువైన శ్రీ గంగా, ఉమా సమేత ఓంకారసిద్ధేశ్వరస్వామి వార్లకు శ్రావణమాసం, అమావాస్య సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లను అలంకరించి రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. – మహానంది

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోండి

పగిద్యాల/పాములపాడు/వెలుగోడు/మహానంది: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ముచ్చుమర్రి, పాములపాడు, వెలుగోడు, మహానంది ఎస్‌ఐలు ఎస్‌ఐ నాగార్జున, కృష్ణమూర్తి, వెంకటనాగప్రసాద్, నాగేంద్రప్రసాద్ సూచించారు. శుక్రవారం వారు తమ పోలీస్‌స్టేషన్లలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన శాంతి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశాల్లో మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలన్నారు. విద్యుదీకరణకు పనుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమజ్జనం రోజున ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా ర్యాలీలు నిర్వహించుకోవాలన్నారు.

30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'



మాట్లాడుతున్న ఎంపీడీఓ మేరి



మాట్లాడుతున్న రమేష్‌నాయుడు

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 30 నుంచి అక్టోబర్ నెల 12 వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మేరి తెలిపారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాల్లో భాగంగా గ్రామాల్లో పర్యటించి ప్రజలకు వైద్యపరీక్షలు అందించాలన్నారు. ఇప్పటికే వలంటీర్లు తమకు కేటాయించిన కుటుంబాల వద్దకు వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, వైద్యాధికారులు వినోద్‌కుమార్, సౌజన్య, విజయేంద్రవర్మ, ఎంఈఓ శ్రీరాములు, ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న పాల్గొన్నారు.

'సురక్ష'ను విజయవంతం చేయాలి

పగిద్యాల: వచ్చే నెల 3 నుంచి చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగనన్న సచివాలయ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, మండల లెవెల్ ఆఫీసర్ బాలయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని పాత, కొత్త ముచ్చుమర్రి, నెహ్రూనగర్ సచివాలయాల్లో వలంటీర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగశేనారెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



లాంగ్‌జంపు చేస్తున్న క్రీడాకారుడు

కొత్తపల్లి: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హెచ్‌ఎం సుబ్బారెడ్డి, స్కూల్‌గేమ్స్ మండల కో–ఆర్డినేటర్ మురళీనాయక్ అన్నారు. శుక్రవారం రెండవరోజు క్రీడాపోటీలను కొనసాగాయి. ఈసందర్భం వారు మాట్లాడుతూ గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. అండర్ –14, –17 విభాగాల్లో రన్నింగ్, జంపింగ్, త్రోస్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిసకస్‌త్రో తదితర పోటీలలో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఉత్తమ ప్రతిభకనపరిచిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సుంకన్న నాయక్, స్వప్న, రీనా బేగం పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

వెలుగోడు: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 3వ రోజు ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ వాదం నాగశేషులు, టి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలో సంఘం నాయకులు పుల్లంరాజు, వేణు, పుల్లయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయం



జగనన్న ఆరోగ్య రక్ష కార్డును అందజేస్తున్న ఎంపీడీఓ గోపీకృష్ణ

పాములపాడు: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య రక్ష కార్యక్రమం ధ్యేయమని ఎంపీడీఓ గోపీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణారావుపేట గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేను ఎంపీడీఓ పరిశీలించారు. సర్వే పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

శ్రీశైలం ప్రాజెక్ట్: మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో సున్నిపెంట గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల విద్యార్థులు సత్తా చాటి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.జి.కిషోర్‌బాబు, పీడీ బి.రాములు నాయక్ అభినందించారు.

ముగిసిన శివచతుస్సప్తాహ భజనలు



శ్రీశైలంలో ముగిసిన శివచతుస్సప్తాహ భజనలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానంలో నిర్వహించిన శివచతుస్సప్తాహ భజనలు శుక్రవారంతో ముగిశాయి. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆగస్టు 17న భజనలు ప్రారంభించారు. శ్రావణమాసమంతా నిరంతరంగా అఖండ శివపంచాక్షరి నామ భజనలు చేశారు. ఆలయ ప్రాంగాణంలోని వీరశిరోమండపంలో ఈ విశేష కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్నూలు నగరానికి చెందిన అయిదు భజన బృందాలు, కర్ణాటకకు చెందిన రెండు భజన బృందాలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మోహన్, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు

శ్రీశైలంప్రాజెక్ట్: మత్తు పదార్థాల జోలికెళ్లొద్దని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దివాకర్‌రెడ్డి సూచించారు. రెండు రోజుల క్రితం ఇద్దరు విద్యార్థులు తరగతి గదిలో మత్తుగా ఉండటం గమనించిన హెచ్‌ఎం ఈశ్వరమ్మబాయి విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపారు. దీనిపై పోలీసులు విచారణ చేట్టారు. సైకిల్ టైర్ల పంక్చర్‌కు వాడే సొల్యూషన్‌ను పీల్చినట్లు తెలుసుకుని శుక్రవారం పాఠశాలలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు లోనై జీవితాలు నాశనం చేసుకోరాదని, తల్లిదండ్రులు కూడా పిల్లలపై నిఘా ఉంచాలని సీఐ సూచించారు. సదస్సులో ఎస్ఐ గంగయ్య యాదవ్, ఎంఈఓ శుక్రునాయక్ పాల్గొన్నారు.